క్లుప్తంగా

ఆదర్శంగా గాంధీ, అంబేడ్కర్ ఆశయాలు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ఐ.పోలవరం: జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఐ.పోలవరం మండలం జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వారి విగ్రహాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎంపీపీ రాణిమిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ శివారు పల్లిపాలెం ప్రాథమిక పాఠశాలలో రాజుపాలెంకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు పితాని సత్యనారాయణమూర్తి 20 మంది విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్, స్వీట్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం అంబాజీపేటకు చెందిన రాయుడు గిరీష్‌రావు దంపతులు రూ.20,116 విరాళం ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందజేశారు. దాతకు శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం సిబ్బంది అందజేశారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెంలో నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 24 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రాజేష్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

తాళ్లరేవు: రహదారిపై నడిచివెళుతున్న ఒక మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కొని పోయినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. నీలపల్లి చెక్కావారిపేటకు చెందిన గంజా మంగాదేవి స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాలలో వంటలు చేస్తుంటుంది. మంగళవారం మధ్యాహ్నం వంట పూర్తయిన తరువాత ఇంటికి వెళుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసును తెంచుకుపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గొలుసు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

మద్యం స్వాధీనం

యానాం: పట్టణం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శేరు నూకరాజు మంగళవారం తెలిపారు. స్థానిక కాకివారి వీధిలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం డిక్కీ బ్యాగ్‌లో దాచిన రూ.13వేలు విలువచేసే 50 రాయల్‌స్టాగ్ మద్యం బాటిల్స్‌ను కనుగొన్నామన్నారు. నిందితుడు కిషోర్‌నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు బైక్‌ను, స్వాధీనం చేసుకున్న మద్యంను డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్, రెవెన్యూ శాఖలకు అప్పగించినట్లు తెలిపారు.

టెలిఫోన్ స్తంభాలను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

అల్లవరం: ఎలాంటి అనుమతులు లేకుండా భూమిలో పాతి ఉన్న టెలిఫోన్ స్తంభాలను వెలికి తీసి ఓడలరేవు నుంచి బొలెరో వాహనంలో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గ్రామస్తులు నిలువరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం పట్టపగలు జరిగిన ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ఆరు టెలిఫోన్ స్తంభాలను వాహనంలో ఎక్కించుకుని వెళ్తుండగా గ్రామానికి చెందిన పోతుల మురళి, రాజేష్, సుధీర్ నివరించి స్థానిక సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అల్లవరం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

యానాం: గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలో గంజాయి అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లామని తెలిపారు. యానాం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆముదాల రాజశేఖర్, విశాఖజిల్లా అరకు ప్రాంతానికి చెందిన కిముడు శతృఘ్న అలియాస్ శత్రు, కనకాలపేటకు చెందిన ఉలిసి వెంకటలక్ష్మీనారాయణ అలియాస్ నానిని తనిఖీ చేయగా 950 గ్రాముల గంజాయి, నగదు లభించిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

అన్నదాతకు వెన్ను దన్ను

- వ్యవసాయానికి ఊతమిచ్చే నిర్ణయం
- ఏప్రిల్ 1 నుంచి ఉపాధి కూలీ వేతనం రూ.272కు పెంపు



గోడిలంకలో పంచాయతీ చెరువులో పూడికతీస్తున్న ఉపాధి కూలీలు

అల్లవరం: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చేలా కొత్త ఆర్థిక సంవత్సరంలో ఎంపిక చేసిన పనులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నిర్వహించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధి పనులు నిర్వహించి తద్వారా ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేశారు. పంట కాలువలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడం, పూడిక తీత పనులు, కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేయడం, పుంత రోడ్లను ఏర్పాటు చేయడం వంటి పనుల్లో ఉపాధి కల్పించనున్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించడమే కాకుండా, ఆ పనులతో రైతులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయి.

పారదర్శకత, నాణ్యత పెరిగేలా..

నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా పని స్వభావాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను అమలు చేస్తోంది. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత పెంచడానికి ఈ విధానం అమలు చేస్తోంది. కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా, వారికి గరిష్టంగా రోజుకి రూ.272 వేతనం ఇవ్వనున్నారు. గత ఏడాది రూ.257 ఉన్న వేతనానికి రూ.15 పెంచి గరిష్టంగా రూ.272గా నిర్ణయించారు. ఈ వేతనం ఏప్రిల్ 1 నుంచి కూలీలకు చెల్లించనున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనం పెంపుపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఊతం ఇచ్చేలా ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించడం వల్ల రైతులకు ఖర్చు ఆదా అవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	జాబు కార్డులు	100 రోజుల పని దినాలు చేసిన కుటుంబాలు	2022–23 ఆర్థిక సంవత్సరంలో చేసిన పని దినాలు	2023–24లో పనిదినాల లక్ష్యం
అల్లవరం	5,981	112	2,46,118	2.84 లక్షలు
ఉప్పలగుప్తం	8,470	37	3,07,898	4.20 లక్షలు
అమలాపురం	7,010	20	1,98,707	2.60 లక్షలు
ముమ్మిడివరం	8,468	49	2,44,166	2.93లక్షలు
ఐ.పోలవరం	8,338	760	3,42,674	3.38 లక్షలు
కాట్రేనికోన	7,081	147	2,19,472	2.62 లక్షలు
తాళ్లరేవు	9,863	140	2,25,474	2.75 లక్షలు

వేతనం పెంచడం సంతోషం



ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని కల్పించారు. తొలకరిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులే కుటుంబాలకు భరోసా కల్పించాయి. కొత్త ఏడాదిలో వేతనం రూ.272 పెంచారని తెలిసింది. చాలా సంతోషంగా ఉంది.

– బొంతు నాగమణి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం

లక్ష్య సాధనకు వీలు



కొత్త ఆర్థిక సంవత్సరంలో సుమారు 2.46 లక్షల పనిదినాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫిబ్రవరి వరకు చేసిన పనికి వేతనాల చెల్లింపులు పూర్తయ్యాయి. మార్చి నెలకు మాత్రమే ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వవలసి ఉంది. ఏప్రిల్ నుంచి కూలీలకు వేతనాలు పెంచడంతో లక్ష్యాలను సాధించే వీలుంది.

– విప్పర్తి శ్రీనుబాబు, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, అల్లవరం

వైఎస్సార్ ఆసరా సభను విజయవంతం చేయండి

అమలాపురం రూరల్: బాలయోగి స్టేడియం ఆవరణలో ఏప్రిల్ 3న జరిగే వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు కోరారు. తాండవపల్లి గ్రామంలో వెలుగు వీఓఏ ఎ.భాగ్యలక్ష్మి, సీసీ లక్ష్మి అధ్యక్షతన మంగళవారం వీవోఏలు మహిళా శక్తి సంఘాల అధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బహిరంగ సభలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 1,817 డ్వాక్రా గ్రూపులకు రూ.16.34 కోట్లు పంపిణీ చేస్తారన్నారు.

4న వైఎస్సార్ ఆసరా సభ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏప్రిల్ 4న వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా శక్తి భవన్‌లో వెలుగు ఏపీఎం కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన మంగళవారం వీవోఏ, మహిళా శక్తి సంఘాలకు సమావేశాన్ని నిర్వహించారు. సభలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మండలంలోని 1,244 డ్వాక్రా గ్రూపులకు రూ.9.22 కోట్లు పంపిణీ చేస్తారన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించాలి

తాళ్లరేవు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పటవల పంచాయతీ కార్యదర్శి రమణమ్మను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈఓపీఆర్‌డీ ఎం.భైరవమూర్తి పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలైన స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలను చేస్తున్న అర్చక స్వాములు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8.10 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేసి కల్యాణ తిలకాలు తీర్చిదిద్దారు. కల్యాణోత్సవాలకు శ్రీకారం వేళ పేరంటాళ్లు పసుపు కొమ్ములు దంచారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు ఫణి దంపతులు నూతన వస్త్రాలు బహూకరించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్దే ఘట్టాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే తంతును అర్చక స్వాములు పెద్దింటి సత్యనారాయణాచార్యులు, పెద్దింటి వీబీఎల్ఎస్ ఆచార్యులు వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు కల్యాణోత్సవాల ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 31న స్వామివారి కల్యాణం, ఏప్రిల్ ఒకటో తేదీన స్వామి తీర్థం, రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కనీస వేతనాలకు వినతి

అమలాపురం రూరల్: కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ కార్యదర్శి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పేదలకు గర్భిణులకు సేవలందిస్తున్న ఆశ వర్కర్ల శ్రమను ప్రభుత్వాలు కారు చౌకగా దోచుకుంటున్నాయని, రూ.పదివేల వేతనంతో బతకడం ఇబ్బందిగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు తమకు వర్తింప చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.బలరాం పాల్గొన్నారు.

అసెంబ్లీలో యానాం సమస్యల ప్రస్తావన

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీలో మంగళవారం యానాం నియోజకవర్గ ప్రజాసమస్యలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సుమారు తొమ్మిది ప్రశ్నలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది 42 మందికి 31 నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత నివేశనా స్థల పట్టాను ఇచ్చినా వారికి గృహనిర్మాణ సబ్సిడీ తదితర ప్రయోజనాలు రాలేదన్నారు. కానీ పట్టా వెనుక సబ్సిడీ మంజూరు చేసినట్లు పేర్కొన్నారని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పుదుచ్చేరి గోరిమేడులో ఇందిరానగర్‌లోని జిప్‌మెర్‌కు ఎదురుగా ఖాళీగా ఉన్న ట్రాన్సిట్ వసతిగృహాన్ని యానాం నుంచి పుదుచ్చేరికి వైద్యానికి వెళ్లే పేద రోగులకు కేటాయించాలని కోరారు. 1996లో మెట్టకూరులో 130 కేవీ విద్యుత్‌స్టేషన్‌ను నెలకొల్పారని, నూతన రిలే వ్యవస్థకు అనుసంధానం చేయకపోవడంతో విద్యుత్‌లైన్లు పనిచేయడం లేదన్నారు. పాంటెక్స్ ఉద్యోగులకు 2019నుంచి జీతాలు చెల్లించడంలేదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న నలుగురు స్టెనోగ్రాఫర్లను 19 ఏళ్లుగా పర్మినెంట్ చేయలేదన్నారు. యానాంలో సీగల్ రెస్టారెంట్‌కి డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌ను నియమించాలని కోరారు. హెడ్‌వెయిటర్ మేనేజర్‌గా వ్యవహరిస్తుండటంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, వీటి వ్యాపార కార్యకలాపాలపై విచారణ చేయాలని కోరారు. యానాం కోపరేటివ్ సొసైటీ ప్రస్తుత పాలక మండలి కాలపరిమితి ఏప్రిల్ 1తో ముగుస్తున్నప్పటికి, 4 నెలలు పొడిగించారని దీనిని ఉపసంహరించుకుని, అడ్మినిస్ట్రేటర్‌ను వేయాలని కోరారు.

ఘనంగా యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ఘనంగా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు యల్లమిల్లి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పార్టీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ట్రేడ్ యూనియన్ 12వ వసంతంలోకి అడుగిడిందన్నారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షుడు జగతా పద్మనాభం, రెడ్డి శివన్నారాయణ, నగర పంచాయతీ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం

తాళ్లరేవు: కోరంగికి చెందిన వ్యాపారవేత్త దివంగత మలిశెట్టి శ్రీను వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పన్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా పలువురికి అన్నదానం చేశారు. సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, లయన్స్ ప్రతినిధులు కిషోర్, నున్న దత్తు, వేలూరి సూరిబాబు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెం గ్రామ పంచాయతీ పరిధి బొర్రాయిపాలెంలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఆలయానికి చల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు రూ.30 వేలు విరాళంగా ఇచ్చారు. స్థానిక గ్రామంలో పార్టీ నాయకుల చేతుల మీదుగా నగదును మంగళవారం గ్రామ పెద్దలకు అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్బాలమ్మ

అమలాపురం టౌన్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా పట్టణ దేవత సుబ్బాలమ్మ మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ఈవో బీవీ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎండీయూడబ్ల్యూప అధ్యక్షుడిగా చంద్రమౌళి

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోరంగి పంచాయతీకి చెందిన వెంటపల్లి చంద్రమౌళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నూతన కార్యవర్గ ఎన్నిక అడహక్ కమిటీ చైర్మన్ పులపకూర అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ఎంపీపీ రాయుడు సునీత పాల్గొన్నారు.

అప్పర్ కౌశిక్ లెఫ్ట్ ఆర్మ్ మీడియం పరిశీలన



కెనాల్ క్రాసింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాగిరెడ్డి తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్ర అగ్రిమిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి, మండల పరిధిలోని ఇందుపల్లి అప్పర్ కౌశిక్ లెఫ్ట్ ఆర్మ్ మీడియం డ్రైన్ బెండ కెనాల్ క్రాసింగ్ ప్రాంతాన్ని పరిశీలించి అండర్ టన్నెల్ మరమ్మతులు చేపట్టాలని జలవనరులు, డ్రైనేజీ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఇంజనీర్లు డీఈ రామగోపాల్, కాశీ విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగార్జున ఎం.వీ కిషోర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, రైతు విభాగపు కార్యదర్శి కె.త్రినాథ్‌రెడ్డి అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరి రామారావు పాల్గొన్నారు.

బాలయోగి స్టేడియంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు



సమావేశంలో మట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: బాలయోగి స్టేడియంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో జిమ్, బ్యాడ్మింటన్, క్రికెట్, స్విమ్మింగ్ క్రీడా వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కోనసీమ జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, కల్చరల్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో సమకూరుస్తున్న క్రీడా వసతులపై మంగళవారం తన చాంబర్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో జిమ్ ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టాలన్నారు. క్రీడావసతులు వినియోగించుకోదలచినవారు ప్రవేశ సభ్యత్వ రుసుం రూ.1,000, నెలవారీ యూజర్ చార్జీలు అధికారులకు రూ.500, ప్రైవేట్ వ్యక్తులకు రూ.1,000గా నిర్ణయించామన్నారు. నిర్వహణ వ్యయాన్ని నెల వారీ యూజర్ చార్జీల నుంచి చెల్లించాలని సూచించారు. ఇద్దరు వైద్యులను ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఉండేలా నియమించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొరను ఆదేశించారు. డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, కమిటీ కన్వీనర్ జిల్లా ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్, సభ్యులు డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావు, పురపాలక సంఘ కమిషనర్ వీఐపీ నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, డివిజనల్ ఇంజినీర్ సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు




జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, చైర్మన్ శేషారెడ్డి తదితరులు

అమలాపురం రూరల్: విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకుంటే వారి కుటుంబం, సమాజం శ్రేయస్సుగా ఉంటాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం మండలం కామనగరువులోని ఆదిత్య స్కూలులో మంగళవారం రాత్రి జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కలెక్టర్‌తో పాటు ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు సంద్ర సుధీర్ జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అకడమిక్ డైరెక్టర్ పీఎస్‌వీఎస్ చలపతిరావు, స్కూల్ ప్రిన్సిపాల్ బి.రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధ ప్రసంగించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

భద్రతా సిబ్బందికి అకడమిక్ తరగతులు

యానాం: కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీ(ఆర్ఆర్‌యూ) ఆధ్వర్యంలో రీజినల్ క్యాంపస్‌ను పుదుచ్చేరిలో ఏర్పాటుచేసిన నేపథ్యంలో వివిధ భద్రతా దళాలకు అక్కడ జూన్ 1నుంచి అకడమిక్ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఆర్‌యు ప్రకటనలో తెలిపింది. జాతీయ సెక్యూరిటీ, పోలీస్ దళాలు, ఆర్మ్‌డ్ పోలీసులు, సెంట్రల్ పోలీస్ సంస్థల దళాలకు అంతర్జాతీయ స్థాయిలో వృత్తినైపుణ్యాలు మెరుగుపరచడానికి ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

చిత్రలేఖనంలో బంగారు పతకాలు



ఉత్తమ ఆర్ట్స్ టీచర్‌గా అవార్డును అందుకుంటున్న రాజకుమార్

అల్లవరం: గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు గురుకులం విద్యార్థులు జాతీయ స్థాయిలో చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ చాటారు. విజయవాడలో డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆకాడమీ నిర్వహించిన 10 వ జాతీయ చిత్ర కళాపోటీల్లో నాలుగు బంగారు, మూడు వెండి పతకాలు వచ్చాయని ప్రిన్సిపాల్ సాయిబాబు మంగళవారం తెలిపారు. డ్రాయింగ్ టీచర్ వురం రాజకుమార్ జాతీయ ఉత్తమ ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా అవార్డుని అందుకున్నారని తెలిపారు.

జాతీయ బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యానాం: మహారాష్ట్రలోని ఆకోలా జిల్లా మూర్తిజాపూర్‌లో వచ్చే నెల 3 నుంచి జరిగే జాతీయ జూనియర్ బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏడుగురు ఎంపికయ్యారని కోచ్ బొట్టా శ్రీనివాస్, యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కె.అనురాగ ఆదర్శశేషసుమన్ తెలిపారు. కర్రి రమ్యతేజశ్రీ, కాపు అనూష, బాలుర విభాగంలో పి. చిన్నికృష్ణ, చింతా వాసు, కర్రి రాఘవేంద్రవర్మ, మహ్మద్ జాఫర్ అలీ, జె.ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు.